ఓలా స్కూటర్లపై భారీ రాయితీ

ఎస్1-ఈ స్కూటర్‌పై రూ.26,750 డిస్కౌంట్

న్యూఢిల్లీ, మార్చి 13: ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ సంస్థ ఓలా..హోలీ పండుగను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. హోలీ ఫ్లాష్ సేల్‌తో ప్రారంభించిన ఈ ఆఫర్ల కింద ఎస్1 ఈ-స్కూటర్లపై రూ.26,750 తగ్గింపునిస్తున్నది. అలాగే ఎస్1 ఎక్స్+(జనరేషన్ 2)పై రూ.22 వేలు డిస్కౌంట్‌ను ఇస్తున్నది. దీంతో ఈ రెండు మాడళ్ల ప్రారంభ ధరలు రూ.89,999, రూ.82,999కి దిగివచ్చాయి. ఈ ప్రత్యేక ఆఫర్లు ఈ నెల 17 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయని పేర్కొంది. దీంతోపాటు మిగతా ఎస్1 స్కూటర్లపై కూడా రూ.25 వేల డిస్కౌంట్ ఇస్తున్నది. ప్రస్తుతం సంస్థ మూడు రకాల స్కూటర్లను విక్రయిస్తుండగా, ఇవి రూ.69,999 నుంచి రూ.1,79,999 ధరల శ్రేణిలో లభిస్తున్నాయి. వీటితోపాటు కొత్తగా ఓలా స్కూటర్లను కొనుగోలు చేసిన వారికి రూ10,500 వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నది. దీంట్లో రూ.2,999 విలువైన మూవ్ ఆపరేటింగ్ సిస్టమ్, రూ.14,999 విలువైన వారెంటీని రూ.7, 499కి అందిస్తున్నది. వీటిలో ఎస్1 ప్రో+ మాడల్ రూ.1,59,999 నుంచి రూ.1.85 లక్షల మధ్యలో లభించనుండగా, ఎస్1 ప్రో మాడల్ రూ.1,29,999 నుంచి రూ.1,54, 999, ఎస్1 ఎక్స్ మాడల్ రూ.89,999 నుంచి రూ.1,19,999 మధ్యలో ధర నిర్ణయించింది.

బీమా ప్రీమియంలపై జీఎస్టీ తగ్గింపు!

న్యూఢిల్లీ, మార్చి 13: బీమా ప్రీమియం చెల్లింపుదారులకు త్వరలో ఊరట లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీమా ప్రీమియం వసూళ్లపై విధిస్తున్న జీఎస్టీని తగ్గించే విషయంపై కేంద్ర ప్రభుత్వం తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ విషయంపై బీమా నియంత్రణ మండలి ఐఆర్డీఏఐ సూచనలు చేయాలని జీఎస్టీ కౌన్సిల్ ఆదేశించినట్లు తెలుస్తున్నది. ఈ నిర్ణయానికి అనుగుణంగా వచ్చే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలోనే రేట్ల తగ్గింపుపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. మే, జూన్ నెలలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశంకాబోతున్నది. ప్రస్తుతం హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం వసూళ్లపై 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనిని తగ్గించాలనే ప్రతిపాదనపై గత కొన్నేండ్లుగా చర్చలు జరుగుతున్నప్పటికీ ఇంకా కొలిక్కిరాలేదు. ఈ సారి కొలిక్కిరానున్నట్లు, ఎంతమేర తగ్గించేదానిపై చర్చలు జరుగుతున్నాయని ప్రభుత్వవర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. ప్రీమియం వసూళ్లపై జీఎస్టీని సున్నా లేదా 5 శాతం లేదా 12 శాతానికి తగ్గించే అవకాశాలున్నాయి. కానీ, ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను బీమా రంగ ప్రతినిధులు కలుసుకొని 12 శాతం విధించాలని సూచించారంట. పలువురు రాష్ట్ర మంత్రులు కూడా 5 శాతం విధించాలని ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ఐఆర్డీఏఐ..బీమా రంగ ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నది. త్వరలో జీఎస్టీ కౌన్సిల్‌కు ఒక నివేదికను సమర్పించనున్నది.

ఇన్సూరెన్స్‌లోకి పతంజలి

డీఎస్ గ్రూప్‌తో కలిసి మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ కొనుగోలుకు రెడీ

న్యూఢిల్లీ, మార్చి 13: యోగా గురువు రామ్‌దేవ్ బాబా నేతృత్వంలోని పతంజలి ఆయుర్వేద్, రజ్నీగంధా తయారీదారు ధరం పాల్ సత్యపాల్ గ్రూప్ (డీఎస్ గ్రూప్) కలిసి సనోటి ప్రాపర్టీస్ ఎల్ఎల్‌పీ అనుబంధ సంస్థ మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌ను కొనుగోలు చేయనున్నాయి. ఈ బీమా సంస్థను ఆదార్ పూనవాలా, రైజింగ్ సన్ హోల్డింగ్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. కాగా, కంపెనీ విలువ రూ.4,500 కోట్లుగా నిర్ణయించి ఈ డీల్ జరుగుతున్నట్టు గురువారం వెలువడిన ఓ ప్రకటన చెప్తున్నది. షేర్ల కొనుగోలు ఒప్పందం ప్రకారం మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌తోపాటు సెలికా డెవలపర్స్, జాగ్వార్ అడ్వైజరీ సర్వీసెస్‌ల అమ్మకానికి సనోటి ప్రాపర్టీస్ ఆమోదం తెలిపింది. రెగ్యులేటరీ అప్రూవల్స్‌కు లోబడి ఈ లావాదేవీ పూర్తి కానున్నది. వివిధ విభాగాల్లో మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ 70కిపైగా ప్రొడక్ట్స్‌ను అందిస్తున్నది. అన్ని ప్రధాన రిస్కులకు బీమా కల్పిస్తున్నది.

రాబోయేది కోతల కాలమే!



ఇంకా తగ్గనున్న వడ్డీరేట్లు

వచ్చే ద్రవ్యసమీక్షల్లో రెపోరేటు 75 బేసిస్ పాయింట్లు దిగిరావచ్చన్న అంచనాలు

ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణం రిజర్వ్ బ్యాంక్ ఆమోదయోగ్య స్థాయిలోనే

తాజా నివేదికలో ఎస్బీఐ రిసెర్చ్ వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 13: రాబోయే ద్రవ్యసమీక్షల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను గట్టిగానే కోత పెట్టవచ్చని ఎస్బీఐ రిసెర్చ్ ఎకోరాప్ తమ తాజా నివేదికలో అంచనా వేసింది. ఈ ఏడాది ఏప్రిల్, జూన్, అక్టోబర్ నెలల్లో జరిగే ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షల్లో రెపోరేటును 25 బేసిస్ పాయింట్ల చొప్పున మొత్తం 75 బేసిస్ పాయింట్లు తగ్గించే వీలుందని చెప్తున్నది. గత నెల జరిగిన ద్రవ్యసమీక్షలో దాదాపు ఐదేండ్ల తర్వాత రెపోరేటును ఆర్బీఐ పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. అంతకుముందు 2020 మే నెలలో చివరిసారిగా తగ్గించారు. ఇప్పుడు రెపోరేటు 6.25 శాతంగా ఉన్నది. కరోనాతో దిగాలుపడిన దేశ ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపర్చేందుకు వడ్డీరేట్లను పెద్ద ఎత్తున తగ్గిస్తూపోయిన ఆర్బీఐ.. ఆ తర్వాత ద్రవ్యోల్బణం అదుపు పేరిట వరుసగా పెంచుతూపోయింది. దీంతో 6.50 శాతానికి చేరింది. అయితే వచ్చే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లు తగ్గుతాయన్న సంకేతాలను అప్పటి ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఇచ్చారు. అందుకు తగ్గట్టే దాస్ తర్వాత వచ్చిన కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా.. ఫిబ్రవరిలో చేపట్టిన తన మొదటి ద్రవ్యసమీక్షలోనే 25 బేసిస్ పాయింట్లు తగ్గించారు. ఈ క్రమంలో వచ్చే ఏప్రిల్, జూన్ ద్రవ్యసమీక్షల్లోనూ వడ్డీరేట్లు 25 బేసిస్ పాయింట్ల చొప్పున తగ్గవచ్చని, ఆగస్టులో విరామం ఇచ్చి అక్టోబర్ సమీక్షలో మళ్లీ 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చని ఎస్బీఐ రిసెర్చ్ అంచనా వేస్తున్నది. ఇలా ఈ ఏడాది కనీసం 75 బేసిస్ పాయింట్లైనా రెపోరేటు తగ్గుతుందన్న విశ్వాసాన్ని వెలిబుచ్చుతున్నది.

4.7 శాతానికి ద్రవ్యోల్బణం

ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుండటం వడ్డీరేట్ల కోతలకు కలిసొస్తున్నదని ఎస్బీఐ రిసెర్చ్ చెప్తున్నది. ఈ జనవరి-మార్చిలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 3.9 శాతానికి తగ్గవచ్చని, మొత్తం ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) 4.7 శాతానికి పరిమితం కావచ్చని పేర్కొంటున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) సైతం 4-4.4 శాతం శ్రేణిలోనే ఉండవచ్చంటున్నది. దీంతో ఆర్బీఐ ఆమోదయోగ్య స్థాయిలోనే ద్రవ్యోల్బణం గణాంకాలుండటం వల్ల వడ్డీరేట్ల కోతలను ఇంకా ఆశించవచ్చని అంటున్నది. ఈ ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏడు నెలల కనిష్ఠాన్ని తాకుతూ 3.6 శాతంగా నమోదైన సంగతి విదితమే. ఆహారోత్పత్తులు, శీతల పానీయాలు, కూరగాయల ధరలు తగ్గడమే ఇందుకు కారణమని కేంద్ర ప్రభుత్వం చెప్తున్నది.

బ్యాంకులపైనే ఆధారం

ఆర్బీఐ రెపోరేటును తగ్గించినా.. దానికి అనుగుణంగా బ్యాంకులు తామిచ్చే రుణాలపై వడ్డీరేట్లను తగ్గించకపోతే రుణగ్రహీతలపై భారం అలాగే ఉంటుందని, మార్కెట్‌లో కొనుగోలు శక్తి పెరగదని నిపుణులు చెప్తున్నారు. ఆర్బీఐ కూడా ఇటీవలికాలంలో ఇదే ఆందోళనను వ్యక్తం చేస్తూ వడ్డీరేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని కస్టమర్లకు ఇవ్వాలని తరచూ సూచిస్తున్నదీ చూస్తూనే ఉన్నాం. రుణాలపై వడ్డీరేట్లు తగ్గితే ఈఎంఐల భారం దిగుతుంది. ఇది రియల్టీ, ఆటో, కన్జ్యూమర్ గూడ్స్ తదితర రంగాల్లో సేల్స్‌ను పెంచుతుంది. మొత్తానికి వచ్చే ఆర్బీఐ ద్రవ్యసమీక్షలపై అటు రుణగ్రహీతలు, ఇటు వ్యాపార-పారిశ్రామిక వర్గాలకు, మరోవైపు బ్యాంకులకు పెద్ద ఎత్తునే అంచనాలున్నాయని చెప్పవచ్చు.

కోతలకు ట్రంప్ సెగ

దేశంగా ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చినా ఆర్బీఐకి వడ్డీరేట్ల తగ్గింపునకు మరో అడ్డంకి ట్రంప్ రూపంలో వచ్చిపడుతున్నది. అంతర్జాతీయ వాణిజ్యంలో సుంకాల పోరుకు కాలు దువ్వుతున్న అగ్రరాజ్యాధినేత.. భారత్‌పైనా వచ్చే నెల నుంచి అధిక సుంకాలు పడుతాయని హెచ్చరిస్తున్నది తెలిసిందే. ఇదే జరిగితే అమెరికా నుంచి దిగుమతయ్యే వస్తూత్పత్తుల రేట్లు అమాంతం పెరగడం ఖాయమే.

నిధుల సేకరణలో కెనరా బ్యాంక్

న్యూఢిల్లీ, మార్చి 13: కెనరా బ్యాంక్ మరోసారి నిధులను సేకరించడానికి సిద్ధమవుతున్నది. బాసెల్-3 నిబంధనలకు లోబడి టైర్-2 బాండ్లను జారీ చేయడం ద్వారా రూ.4 వేల కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. ఐదు లేదా పదేండ్ల కాలపరిమితితో ఈ బాండ్లను జారీ చేస్తున్నది. ఈ నిధుల సేకరణకు బ్యాంక్ బోర్డు అనుమతినిచ్చినట్లు పేర్కొంది.

ఫోర్బ్స్40 అండర్ 40లో హైదరాబాదీ

హైదరాబాద్, మార్చి 13: హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త అకిన్ అనలిటిక్స్ సీఈవో, ఫౌండర్ జానకి పులపర్తి..ఫోర్బ్స్ 40 అండర్ 40 జాబితాలో చోటు దక్కించుకున్నారు. కృత్రిమ మేధస్సుతో నడిచే డ్రోన్లను తయారు చేసే సంస్థకు ఆమె నాయకత్వం వహిస్తున్నారు. రక్షణ, వ్యవసాయం, ఇండస్ట్రియల్స్ రంగాల్లో పరిశోధనలు గావించారు. అలాగే 15 వేల మంది స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలకు డ్రోన్ల పైలెట్లుగా తీర్చిదిద్దారు.

సెన్సెక్స్ @1,05,000?

ఈ ఏడాది డిసెంబర్‌కల్లా చేరవచ్చు

మోర్గాన్ స్టాన్లీ అంచనా



ముంబై, మార్చి 13: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో ఉరుముతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లు ఒకడుగు ముందుకు, నాలుగడుగులు వెనుకకు అన్నట్టున్నాయి. భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు ఆందోళనల్ని రేకెత్తిస్తుంటే.. మదుపరులు స్టాక్స్ నుంచి పెట్టుబడుల ఉపసంహరణలకు దిగుతూ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. భారతీయ పరిస్థితులూ ఇందుకు మినహాయింపు కాదు. అయినప్పటికీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ ఈ ఏడాది ఆఖరుకల్లా లక్ష మార్కును దాటి 1,05,000 వద్దకు వెళ్తుందన్న ఓ తాజా అంచనా ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారుతున్నది. అవును.. మోర్గాన్ స్టాన్లీ వేసిన ఈ అంచనా ట్రేడ్ వర్గాల్లో హల్‌చల్ చేస్తున్నదిప్పుడు. ప్రస్తుతం సెన్సెక్స్ ఉన్న స్థాయితో చూసినట్టైతే.. మోర్గాన్ స్టాన్లీ అంచనా 41 శాతం అధికం మరి. గురువారం 74వేల మార్కునూ కోల్పోయింది. ఈ క్రమంలో ఏకంగా లక్ష స్థాయిని దాటేస్తుందని మోర్గాన్ స్టాన్లీ చెప్పడం మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. ట్రంప్ టారిఫ్ భయాలతో ఇటీవలికాలంలో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస నష్టాలనే చవిచూస్తున్నాయి. అప్పుడప్పుడు పెరిగినా.. ఆ తర్వాత వచ్చే నష్టాలు ఆ ఆనందాన్ని దూరం చేస్తున్నాయి. అయితే పరిస్థితులన్నీ చక్కబడుతాయన్నట్టుగా మోర్గాన్ స్టాన్లీ చెప్తున్నది. దీంతో మదుపరుల్లో కొత్త ఆశలు చిగురించే వీలుందని స్టాక్ బ్రోకర్లు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

74వేల దిగువకు సెన్సెక్స్

రియల్టీ, ఐటీ, వాహన రంగ షేర్లలో గురువారం భారీగా విక్రయాలు జరగడంతో వరుసగా ఐదోరోజూ సూచీలు నష్టపోయాయి. 200 పాయింట్లకుపైగా నష్టపోయిన సెన్సెక్స్ 74 వేల దిగువకు పడిపోయింది. చివరకు 73,828.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 73.30 పాయింట్లు కోల్పోయి 22, 397.20 వద్ద ముగిసింది. స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలతో మదుపరులు లక్షల కోట్ల సంపదను కోల్పోతున్నారు.

ఎల్ జీ ఐపీవోకి సెబీ గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, మార్చి 13: దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ సంస్థ ఎల్‌జీ ఐపీవోకి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వాటాల విక్రయం ద్వారా రూ.15 వేల కోట్ల నిధులను సేకరించాలని సంస్థ భావిస్తున్నది. స్టాక్ మార్కెట్లో లిస్ట్ కాబోయే దక్షిణ కొరియాకు చెందిన రెండో సంస్థ ఎల్‌జీ కానుండటం విశేషం. ఇప్పటికే గతేడాది హ్యుందాయ్ మోటర్ స్టాక్ మార్కెట్లో లిస్టైన విషయం తెలిసిందే. 15 శాతానికి సమానమైన 10.18 కోట్ల షేర్లను విక్రయించే ప్రతిపాదనపై గతేడాది సెబీకి ఎల్‌జీ దరఖాస్తు చేసుకున్నది. ప్రస్తుతం సెబీ నుంచి అనుమతిపొందినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. మొత్తం ఐపీవో వివరాలు వెల్లడించకపోయినప్పటికీ రూ.15 వేల కోట్ల స్థాయిలో ఉంటుందని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. గతేడాదికిగాను రూ.64,087 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది.

మరో 157 ఎకరాల అసైన్డ్ భూమికి ఎసరు!

- భూసేకరణకు నోటిఫికేషన్ జారీ
- ఇండస్ట్రియల్ పార్క్ కోసమని వివరణ

హైదరాబాద్, మార్చి 13(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడా అసైన్డ్ భూములను రాష్ట్ర ప్రభుత్వం వదలడం లేదు. పారిశ్రామికవాడల ఏర్పాటు పేరుతో వరుసగా భూసేకరణ నోటిఫికేషన్లను జారీచేస్తూ రైతులను ఆందోళనలకు గురిచేస్తున్నది. రంగారెడ్డి జిల్లా కొంగరఖుర్ద్‌లో 277 ఎకరాల అసైన్డ్ భూముల సేకరణకు బుధవారం నోటిఫికేషన్ జారీచేయగా.. తాజాగా గురువారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల పరిధిలో 157.23 ఎకరాల అసైన్డ్ భూమిని సేకరించేందుకు సర్కారు నోటిఫికేషన్ జారీచేసింది. మొత్తం 98 మంది రైతుల నుంచి ఈ భూములను సేకరించనున్నారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం భూములు సేకరిస్తున్నట్టు, సంబంధిత ప్లాన్ కలెక్టరేట్‌లో ఉన్నట్టు జిల్లా కలెక్టర్ ఆ నోటిఫికేషన్‌లో తెలిపారు. ఈ భూముల క్రయవిక్రయాలు, లీజుకి ఇవ్వడం వంటి లావాదేవీలు నిర్వహించకూడదని అందులో పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉన్నవారు 60 రోజుల్లోగా జిల్లా కలెక్టర్, లేక అధీకృత అధికారి సమక్షంలో తమ అభ్యంతరాలను నమోదు చేసుకోవచ్చని సూచించారు.

రైతులకు నిద్రలేని రాత్రులు

రంగారెడ్డి, మెదక్, నల్లగొండ తదితర ఉమ్మడి జిల్లాల్లోని అనేక ప్రాంతాలు హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో సహజంగానే ఆ ప్రాంతాల్లోని భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రభుత్వం పరిశ్రమలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించకుండా హైదరాబాద్ కేంద్రంగా పారిశ్రామికవాడలను ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో రాజధాని శివారు రైతులకు కంటిమీద కునుకు లేకుండాపోయింది. కోట్ల రూపాయల భూములకు అరకొరగా నష్టపరిహారం చెల్లిస్తుండటంతో జీవనోపాధి కోల్పోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం జారీచేసిన భూసేకరణ నోటిఫికేషన్లలో అత్యధికంగా అసైన్డ్ భూములే ఉండగా, దీనివల్ల ఎక్కువ శాతం దళిత, గిరిజనులే తీవ్రంగా ప్రభావితమవుతుండటం గమనార్హం.

అన్నీ పచ్చని పంట పొలాలే....

వాస్తవానికి పారిశ్రామిక అవసరాల కోసం వ్యవసాయ యోగ్యం కాని భూములను, ప్రభుత్వ భూములను ఎంపిక చేయాల్సి ఉంటుంది. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే సంబంధిత రైతుల అనుమతి మేరకే పంట పొలాలను సేకరించాల్సి ఉంటుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వం రైతులతో సంప్రదింపులు జరపకుండానే ఏకపక్షంగా భూసేకరణ నోటిఫికేషన్లు జారీచేస్తున్నది. లగచర్ల, దిలావర్‌పూర్, తిమ్మాపూర్, నాగిరెడ్డిపల్లి, కొంగరఖుర్ద్, తాజాగా గుమ్మడిదలలో ఇదే విధంగా నోటిఫికేషన్లు జారీచేసింది. లగచర్లలో ఏకపక్ష భూసేకరణపై ఇప్పటికే హైకోర్టు స్టే విధించగా, మిగిలిన ప్రాంతాల్లో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో రైతుల ఆందోళనలను లెక్కచేయకుండా రోజుకో ప్రాంతంలో పోలీసు పహారాలో బలవంతంగా భూసేకరణకు చర్యలు చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పని ఒత్తిడితో నిద్రలేమి

నిద్రకు దూరమవుతున్న టెకీలు, వ్యాపారవేత్తలు

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ): దేశంలోని 55 శాతం మంది టెకీలు, వ్యాపారవేత్తలు నిద్రలేమితో బాధపడుతున్నారు. పని ఒత్తిడితో ఆయా రంగాలవారు నిద్రకు దూరమవుతున్నారని 'టై గ్లోబల్ అండ్ హార్ట్‌ఫుల్‌నెస్' సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ప్రపంచ నిద్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పుణె నగరాలకు చెందిన 260 మంది వ్యాపారవేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, టెక్ ప్రొఫెషనల్స్ సర్వే చేశారు. పని ఒత్తిడి, ఆర్థిక అనిశ్చితి, ఎక్కువ సమయాలు పనిచేయడం వల్ల నిద్రకు దూరమవుతున్నట్టు వారు పేర్కొన్నారు. కేవలం నిద్ర లేకపోవడంతోనే ఉత్పాదకత, ఏకాగ్రత, ఉద్యోగ సంబంధిత పనులు సమర్థవంతంగా చేయలేకపోతున్నట్టు 80 శాతం మంది వివరించారు.

సర్వేలో గుర్తించిన ఆసక్తికర అంశాలు...

- 40 శాతం మంది వ్యాపారవేత్తలు రాత్రి సమయాల్లో పీడకలలు, ఒత్తిడి, పర్యావరణ దుష్ప్రభావాలు వల్ల నిద్రలేమితో బాధపడుతున్నారు.
- 83 శాతం మంది పడుకునే ముందు ఫోన్లు వాడుతున్నారు. దాని వల్ల వారి నిద్ర నాణ్యత తగ్గుతున్నదని గుర్తించారు.
- ప్రతి ఇద్దరు వ్యాపారవేత్తల్లో ఒక్కరు తీవ్ర స్థాయిలో మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.
- వారు ఆరు గంటలకంటే తక్కువసేపు నిద్రపోవడంతో, ఉత్పాదకత తగ్గిపోతున్నది
- నిద్ర లేమి వల్ల తమ వ్యక్తిగత, ఉద్యోగ జీవితాలపై తీవ్ర ప్రభావాలు పడుతున్నాయని 80 శాతం ప్రొఫెషనల్స్ వెల్లడించారు.

బీసీ యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ

హైదరాబాద్, మార్చి13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ బీసీ యువతీయువకులకు డ్రైవింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు కార్పొరేషన్ ఎండీ మల్లయ్యభట్టు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో హకీంపేటలో శిక్షణ ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు జిల్లా బీసీ అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తులు 31లోగా సమర్పించాలని సూచించారు.

చంద్రబాబుతో నాగం భేటీ

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఏపీ సీఎం నారా చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఓబుళాపురం మైనింగ్ కేసు విచారణలో భాగంగా గురువారం విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు నాగం హాజరయ్యారు. ఎట్టకేలకు ఉమ్మడి రాష్ట్రంలోని ఈ కేసులను కొట్టివేసింది. చాలా కాలం తర్వాత కలవడంతో నాగంను చంద్రబాబు ఆత్మీయంగా పలకరించారు.

మానవ అక్రమ రవాణా కేసులో ఈడీ దూకుడు

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): బంగ్లాదేశీయుల అక్రమ రవాణాకు సంబంధించిన రెండుకేసుల్లో విచారణ చేపట్టిన హైదరాబాద్ జోనల్ ఈడీ అధికారులు రూ.1.90 లక్షల విలువైన ఆస్తులను జప్తు చేశారు. నిందితుల్లో ఎక్కువమంది బంగ్లాదేశీయులు చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించారని తేలింది. కాగా, వీరు నకిలీ సర్టిఫికెట్లతో గుర్తింపుకార్డులు పొందారని తేల్చింది. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి వీరిని వ్యభిచార కూపంలోకి దింపారని ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు.

కాంగ్రెస్‌కు పెండింగ్ బిల్లుల గండం

- పంచాయతీలకు 691 కోట్లు పెండింగ్
- తాజా మాజీ సర్పంచులు గరంగరం
- స్థానిక ఎన్నికల్లో చూపనున్న ప్రభావం

హైదరాబాద్, మార్చి 13 (నమస్తేతెలంగాణ): స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న అధికార కాంగ్రెస్ పార్టీకి పెండింగ్ బిల్లుల గండం పొంచి ఉన్నది. పంచాయతీ పాలన ముగిసి 14 నెలలు గడుస్తున్నా, పెండింగ్‌లో ఉన్న రూ.691.93 కోట్ల బిల్లల చెల్లింపు విషయంలో సర్కార్ తీవ్ర జాప్యం చేస్తూ వస్తున్నది. దీంతో 14 నెలలుగా తాజామాజీ సర్పంచులు పోరుబాట పట్టారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారంతా ఆగ్రహంతో ఉన్నారు. ఈ దశలో ఎన్నికలు జరిగితే పెండింగ్ బిల్లులు చెల్లించని కాంగ్రెస్‌పై తీవ్ర ప్రభావం పడనున్నది. సర్పంచుల సంఘం రాష్ట్ర కమిటీ, జేఏసీ నేతలు అనేకసార్లు సీఎం, ఇతర మంత్రులను కలిసి పెండింగ్ బిల్లుల విషయాన్ని విన్నవించినా పెడచెవిన పెట్టారని తాజా మాజీ సర్పంచులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వినతిపత్రాలు ఇచ్చిన స్పందన కరువైందని, శాంతియుత నిరసనలు చేపడితే పట్టించుకోనేలేదని, పోరాటాలు చేస్తే అరెస్టులు చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పుడు ఇప్పుడు అంటూ దాటవేస్తున్నారే తప్ప బిల్లులు మాత్రం ఇవ్వడమే లేదని చెప్తున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాజీ సర్పంచులు, స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 12,848 సర్పంచ్ పదవులు, 5,817 ఎంపీటీసీ స్థానాలు, 578 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి.

పోటీపై నిరుత్సాహం.. బుద్ధి చెప్పేందుకు సిద్ధం

సర్పంచులుగా ఎన్నికైనవారు సొంత డబ్బులు సైతం వెచ్చించి గ్రామాల్లో అనేక పనులు చేపడుతుంటారు. ఆ పనులే ఎజెండాగా తదుపరి ఎన్నికల్లో పోటీ చేస్తుంటారు. గ్రామ పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో 70 శాతానికిపైగా మాజీ ప్రజాప్రతినిధులే మళ్లీ పోటీ చేస్తుంటారు. ప్రస్తుతం ఉన్న 12,848 స్థానాల్లో సుమారు 8,000 స్థానాల్లో పాతవారే పోటీచేసే అవకాశం ఉంటుది. కానీ ఈసారి పరిస్థితి భిన్నంగా కనిపిస్తున్నది. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో వారిపై అప్పులభారం పెరిగింది. ఈ పరిస్థితుల్లో ఎన్నికల బరిలోకి దిగేందుకు నిరాసక్తత వ్యక్తం చేస్తున్నారు. హామీ ఇచ్చి మోసం చేసిన అధికార పార్టీపై తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. బిల్లులు అడిగితే అరెస్టులు చేసిన విషయాన్ని మరిచిపోలేమని గుర్రుగా ఉన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో ఎలాగైనా కాంగ్రెస్ అభ్యర్థులను ఓడిస్తామని బాహాటంగానే చెప్తున్నరు. రాష్ట్ర సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో ఈ దిశగా కార్యాచరణ రూపొందించేందుకు సన్నద్ధమవుతున్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధిచెప్తాం

పంచాయతీల్లో చేసిన పనుల పెండింగ్ బిల్లుల కోసం అరిగోస పడుతున్నం. మంత్రులు, అధికారుల చుట్టూ తిరిగి అలిసిపోయినం. అనేకసార్లు నిరసన తెలిపినా ఫలితం రాలేదు. ఇప్పటివరకూ ప్రభుత్వం స్పష్టమైన ప్రకటనే చేయడం లేదు. బడా బడా కాంట్రాక్టర్లకు వేల కోట్లను అప్పనంగా కట్టబెడుతున్న ప్రభుత్వం.. పల్లెల్లో అభివృద్ధి పనులు చేసిన సర్పంచులకు బిల్లులు ఇవ్వకుండా మోసం చేసింది. దగా చేసిన కాంగ్రెస్‌ను ఎట్టిపరిస్థితుల్లో వదిలిపెట్టం. వచ్చే స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్తాం.

– సుర్వి యాదయ్యగౌడ్, సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

'ఆజంజాహి' కూల్చివేతపై విచారణ ప్రారంభం

- జాతీయ కమిషన్ ఆదేశాల మేరకు వరంగల్ తహసీల్దార్ చర్యలు
- ఆధారాలు సమర్పించిన నాయకులు

తహసీల్దార్ ఇక్బాల్‌కు ఏజే మిల్లు కార్మిక భవన పరిస్థితులను వివరిస్తున్న కార్మికులు

పోచమ్మమైదాన్, మార్చి 13 : ఆజంజాహి మిల్లు కార్మిక భవనం కూల్చివేతపై జాతీయ ఎస్సీ కమిషన్ ఆదేశాల మేరకు వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం విచారణ ప్రారంభమైంది. నాయకులు, కార్మికులు కలిసి ఆనాటి కార్మిక భవనానికి సంబంధించిన ఆధారాలను వరంగల్ తహసీల్దార్ ఎండీ ఇక్బాల్‌కు అందజేశారు. విచారణలో భాగంగా వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో కార్మిక భవనం పరిరక్షణ సమితి నాయకులు, దళిత కార్మికులు తహసీల్దార్‌కు కార్మిక భవనానికి సంబంధించిన అన్ని ఆధారాలను సమర్పించారు. అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మార్టిన్ లూథర్ మాట్లాడుతూ.. 75 సంవత్సరాల పాటు కార్మికుల సమావేశాలు, సభలకు వేదికైన ఆజంజాహి కార్మిక భవనాన్ని తప్పుడు పత్రాలతో కబ్జాచేసి కూల్చారని తెలిపారు. భవనాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టెలిమెట్రీల ఏర్పాటుకు రూ.4.15 కోట్లు

హైదరాబాద్, మార్చి13 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం, సాగర్ ఔట్‌లెట్లపై రెండో దశ టెలిమెట్రీలను ఏర్పాటు చేసేందుకు కేఆర్ఎంబీకి గురువారం రాష్ట్ర ప్రభుత్వం రూ.4.15 కోట్లు విడుదల చేసింది. జలాల తరలింపుపై కచ్చితమైన లెక్కలను తీసేందుకు మొదటి దశలో పలు చోట్ల ఏర్పాటు చేశారు. రెండో దశలో టెలిమెట్రీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. రూ. 7కోట్లు అవసరమవుతాయని, ఆ నిధులను విడుదల చేయాలని ఇరు రాష్ట్రాలకు ఇటీవలనే బోర్డు సూచించింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం నిధులను విడుదల చేసింది.

పతాక స్థాయికి బీసీ ఉద్యమం

పోరు మరింత ఉధృతం చేయాలి : ఆర్ కృష్ణయ్య



ముషీరాబాద్, మార్చి 13: బీసీల డిమాండ్ల సాధన కోసం చేస్తున్న ఉద్యమం నేడు పతాక స్థాయికి చేరిందని, ఈ దశలో దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉన్నదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య అభిప్రాయపడ్డారు. గురువారం ఆయన ఢిల్లీలో ఆందోళన చేపట్టిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని, కేంద్రం విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను బీసీల జనాభా ప్రకారం 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలని, పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 22 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని, రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలని, బీసీల విద్యా, ఉద్యోగ, రిజర్వేషన్లపై ఉన్న క్రీమీలేయర్‌ను తొలగించాలని, బీసీలకు మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు పెట్టాలని, సుప్రీం కోర్టు, హై కోర్టు జడ్జిల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఆందోళనలో తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్, మారేశ్, పీతాని ప్రసాద్, రాజ్ కుమార్, శ్రీనివాసరావు, భూపేసాగర్ పాల్గొన్నారు.

గురుకుల ఫలితాలను విడుదల చేయలేదు

వదంతులు నమ్మొద్దు : సొసైటీ సెక్రటరీ వర్షిణి

హైదరాబాద్, మార్చి13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థలలో అడ్మిషన్ల కోసం గత నెల నిర్వహించిన కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలను ప్రకటించినట్టు వస్తున్న వార్తలు అవాస్తవమని సొసైటీ సెక్రటరీ వర్షిణి వెల్లడించారు. గురువారం ప్రకటనలో వెల్లడించారు. ఫలితాలు విడుదల చేసినట్టు జరుగుతున్న ప్రచారాన్ని నమ్మి అయోమయానికి గురి కావద్దని కోరారు. ఫలితాలను ప్రకటించే ముందు సమాచారం అందిస్తామని పేర్కొన్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.